# ఆశ్చర్య పరిచయం



విశాఖ పట్నంలో రామాన్ని బి. యస్. సి. ఆనర్సులో ప్రవేశపెట్టి రావడం నర్సాపురంలో నారాయణకు కొత్త కొత్త చుట్టాల్ని పరిచయం చేసింది.

ఒకనాడు కచేరీకి వెళుతూంటే "నమస్కారమండోయ్ లక్ష్మీనారాయణ గారూ!" అన్న సలక్షణమైన పిలుపు వినిపించింది వెనకాల నుంచి.

'ఎవరినా' అని తిరిగి చూచేంతలో "ఏదో దురదృష్టవశాత్తూ దూరస్థంగా ఉండిపోయినంత మాత్రం చేత మన పూర్వపు సంబంధ బాంధవ్యాలు మరచిపోవడం మీ వంటి వారికి భావ్యమా?" అంటూ ఏ నాడూ ముఖ పరిచయం లేని పెద్దమనిషొకాయన భుజంమీద చెయ్యి వేశాడు.

"అమ్మమ్మ ఎంత మాట!" అంటూ అప్రయత్నంగా ముక్కు మీదికి వేలు పోనిచ్చి "కాస్త సరిగ్గా జ్ఞాపకం రావడం లేదంతే" అన్నాడు నారాయణ గౌరవంకొద్దీ, ఎవరో దూరపు బంధువై వుంటాడని అతని మాటల వల్లే వూహిస్తూ, 'అసలు జ్ఞాపకం రావడానికి మీరు నన్నెక్కడేనా చూస్తే కదూ?'

శ్రీ జయంతి రామారావ్

శుద్ధ వైదీకిలా తుంచిపారేశాడా కొత్త చుట్టం. మళ్ళీ అంతలోనే "అలా అని మేం అన్య ప్రాంతీయుల మనుకునేరు-" కళ్ళు పెద్దవి చేస్తూ, ఏదో దురభిప్రాయమనే ఏటో పడి పోగలరన్నట్లు చేతులు పెట్టాడు. "ఆ మాట కొస్తే ఒక నెల్లాళ్ళ నుంచి నేనూ యీ నగర వాస్తవ్యుణ్ణే" అన్నాడు బుర్ర టకాయిస్తూ.

పౌరసత్వపు హక్కుకోసం పోరాడి వచ్చిన 'లంక భారతీయుడా' అనిపించింది నారాయణను.

"అయివుండొచ్చు" అన్నాడు తాపీగా, ఆలోచిస్తూ నారాయణ.

"అమ్మమ్మ ఎంత మాట సెలవిచ్చారు..." హఠాత్తుగా అవతలాయన అందుకునేసరికి హడలిపోయాడు నారాయణ. 'ఎంత మాట సెలవిస్తే లానా' అని.

"...కాలమాన పరిస్థితుల వల్లనూ, ఉద్యోగ యాతనల మూలకంగానూ, ఇంతకాలం నుంచీ ఒకే ఊళ్ళో ఉంటున్నా మనం కలుసుకోలేక పోయాంగాని."

గంగా ప్రవాహంలా చెప్పుకు పోతున్నాడా కొత్తాయన. ఉక్కిరి బిక్కిరై పోతున్నాడు నారాయణ.

"కలుసుకోలేక పోయాం గాని, మీ తండ్రిగారి తాతగారున్నూ, మా తాతగారి తండ్రి గారున్నూ, వినానరం 'కౌన్సిల్లంత'లో ఒకే పేటలో ఉంటూండేవారు.

"అమ్మయ్యా అంతే కదా!" అనుకుని ఊపిరి పీల్చుకున్నాడు నారాయణ.

అతను కలిపిన బాదరాయణ బంధుత్వానికి ఆశ్చర్యపోయాడు! అదే ధోరణిలో చెప్పుకు పోతున్నాడా బంధువు: "అంతలా యిరుగూ పొరుగూ కాకపోయినా ఒక్క యింటి వాళ్ల లాగ మెలిగే వారు మీ కుటుంబమూ, మా కుటుంబమూను. అసలు మీరు వెలితే నమ్మరు గాని, మీ యింటికీ, మా యింటికీ, పెరట్లోంచి ఒక రహదారే ఏర్పడి పోయింది.! ఆఖరు వరకు అలానే నడిచింది మన ఆత్మీయత, ఆ ఊళ్ళోవాళ్ళందరూ బంధువులా అనుకునేటట్లు. అయితే అంత దగ్గర చుట్టరికాలేవీ లేకపోయినా ఒక్క శాఖ వాళ్ళం. అయినా కాకపోయినా, తాత తండ్రుల దగ్గర్నుంచీ వస్తున్న

(మిగతా 61 వ పేజీలో)

# అపూర్వ పరిచయం

(15 వ పేజీ తరువాయి)

స్నేహితం కంటె కావలిసిందేముంటుందండి బాంధవ్యానికి? ఏ మంటారు?"

"అవు నవును" అంటూ బుర్రాడించాడు నారాయణ, అతని 'అయినా కాక పోయినా' లూ, 'కాక పోయినా లేక పోయినా' లూ అర్థం కాక.

అంతట్లో అదోలా విచార కరంగా ముఖం పెట్టి మళ్ళీ అందుకున్నా డా తరతరాల బాంధవుడు: "కాని తర్వాత మాత్రం క్రమ క్రమంగా ఉద్యోగాల మీదా, యితర వృత్తుల ననుసరించి, మొదట మీ తాత గారూ, తర్వాత మా తండ్రి గార్లూ ఆ ప్రదేశాన్ని విడిచి పెట్టడం తటస్థించింది. ఆ విధంగా, మూడు తరాల నుంచీ వస్తూన్న మన సంబంధ బంధాలుతాత్కాలికంగా సడలడం సంభవించింది. కాని యీనాడు— అంటే నాలుగో తరాన—మనం మళీ ఏక నగరం వాస్తవ్యులుగా కలుసుకున్నా మంటే, యిది నిజంగా పితృ దేవతల ఆదేశాను సారమే అయి వుంటుందని నా నమ్మకం! ఈ నాడు మనం, నిజంగా రెండు కుటుంబాలూ కలిసి, చేయవలసిన శుభకార్యాలేమిటున్నాయో!" పరిశీలనగా నారాయణ ముఖం కేసి చూస్తూ, అన్నా డా పితృ దేవతల దూత. అవతల ఆఫీసు వేళయిపోతున్న నారాయణ అదేమీ గమనించకుండా "అంతే లెండి! ఏదో మహత్కార్య సాధన మిగిలిపోయి ఉంటేగాని యిటువంటి అపూర్వ సమావేశాలు జరగవు" అంటూ పొడిగా జవా బిచ్చాడు.

"ఆ నమ్మకం మీకూ ఉంది కదా! యిక వర్తమాన పరిస్థితుల్లోకి రండి, ఆలో చిద్దాం. అన్నట్లు మీ కవతల కచేరికి వేళయిపోతున్నట్లుందే" అంటూ 'కాద'నిపించడానికి లౌక్యంలో వుండే గమ్మత్తును ఉపయోగించాడు ఆ లాక్షణికుడు.

"అబ్బే లేదండి, కావలసినంత వేళుంది. కాస్త ఆలస్యమైనా ఫర్వాలేదు" —అలని లౌక్యానికి యిట్టే లొంగిపోయినాడు నారాయణ.

"ఉద్యోగ మంటే అలా వుండాలండి! ఒకరి అదుపూ ఆజ్ఞా లేకుండా, ఎంత వేళ కెళ్ళినా 'ఏం' అని అడిగేవాడులే కుండా వుంటే అదీ పదవి. అంతే గాని మా స్కూలు మాస్టర్లదీ ఒక ఉద్యోగమే?" చిన్న మరిపింతాలు పెట్టా డా లౌక్యుడు నారాయణను.

"వర్తమానంలోంచి ఉద్యోగాలలోకి కప్పదాటు వేశా దేమిటా" అని చూస్తూన్నాడు నారాయణ.

"అయినా యీ స్కూలు హెడ్మాస్టరు కంటె సక్కూబాయి అత్తగారు నయమనుకోండి! ఒక్క నిమిషం ఆలస్యమైతే ఉరుములూ పిడుగులూ కురిసేవనుకోండి. మంగళగిరిలో శైలేజా మహారాజులా వుండే..." విట్టూర్పు విడుస్తూ, అన్నారు బంధువులు "అయితే అక్కణ్ణుంచీ యీ పిల్లల చదువులు పెళ్ళిళ్ళ గురించి కదిలి రావలసొచ్చిం దీ పూరికి కాని అంతా నెల రోజులే అయింది నే నా ఊరు విడిచిపెట్టి."

"అంటే మీ రక్కడా..." ఏమిటి చేస్తూండేవా రన్నట్లు నసిగాడు నారాయణ.

"అయ్యయ్యో, అసలు సంగతి మరిచిపోయినా నీ పిల్లల గొడవలో పడి! నే నక్కడ మంగళగిరిలో మంగళగిరి బోర్డు ఎలిమెంటరీ స్కూలు హెడ్మాస్టరుగా ఉండేవాణ్ణి" అంటూ పై మీది కండువా సర్దుకున్నారు పాత హెడ్మాస్టరు గారు. కొంచెం ఠీవిగా నించుంటూ.

'ఓహో అలాగా' అన్నాడు నారాయణ, అతను కూడా గతంలో 'సక్కూబాయి అత్తగారే' అన్న భావం స్ఫురించగానే చిన్న నవ్వు నవ్వుతూ.

"అయితే అక్కడ హైస్కూలు లేకపోవడం చేత యిక్కడ మా కుర్రవాణ్ణి థర్డు ఫారంలో జాయిను చేయించు దామనిన్ని, తర్వాత, నేనూ యిక్కడే వుంటే పిల్లల కేవైనా మంచి సంబంధాలు చూస్తూండవచ్చు ననిన్నీ, యీ స్కూల్లోనే లోయర్ ఫారమ్స్ టీచరుగా బదలాయింపు చేయించుకున్నాను. అంచేత సకుటుంబంగానే యిక్కడికి వచ్చేశాను. ఆ ఊర్నేదో ఉద్ధరించి నట్లు అన్నారు ఎక్స్ బోర్డు ఎలిమెంటరీ స్కూలు హెడ్మాస్టరు గారు.!

"చాల మంచి పని చేశారు" అన్నాడు నారాయణ నెల రోజుల క్రిందటి ఆతని ఆగమనానికి ఈ రోజున స్వాగత పత్రం చదువుతూ.

అంతట్లో అదే మంచి సమయ మన్నట్లు, అటూ యిటూ చూసి, రహస్యంగా, కొంచెం ముందుకు వంగుతూ "చూశారూ, అంత పెద్ద పట్నం కాకపోయినా, మీ లాంటి బంధువులు నలుగురూ ఉన్న ఊరు కాబట్టి, ముందు మా పెద్దమ్మాయి కేదేనా మంచి సంబంధం సిద్ధ పరుచు కుందామని ముఖ్యంగా యీ వూరొచ్చాను. కాకుండా ఎన్నాళ్లా మంగళగిరి మన్యాలో పడిగాపులు పడితే మాత్రం మనం ఎన్నుకున్న సంబంధాలు వస్తాయి చెప్పండి? ఒకవేళ ఏమైనా వచ్చినా, వాళ్లు మంచి వాళ్లూ, మన వాళ్లూ అవుతారని నమ్మక మేం? ఏ మంటారు?" అన్నారు హెడ్మాస్టరు గారు అంతరంగికంగా.

"అవునవును. సాధారణంగా, చదువుకున్న కుర్రవాళ్లు ఆ ప్రాంతాల్లోకి రావడం కష్టం" అన్నాడు నారాయణ మామూలుగా.

తటాలున అందుకుంటూ "అంచేత మేమే వచ్చేశాం అన్నట్టు మీ తమ్ముడు ఆంధ్రా యూనివర్సిటీలో చదువుతున్నాట్ట! ముఖ్యంగా అతన్ని చూద్దామని వచ్చాను. అయితే యిప్పుడు అక్కడ హాస్టల్లో ఉంటున్నాడా? సెలవులకొస్తా డనుకుంటాను!" అంటూనే మెల్లగా పెళ్లి బేరాల్లోకి దిగబోతున్నాడా పెద్దమనిషి.

"హరి హరీ తప్పదియ్యా! యిదా అసలు సంగతి! చివరికి తిప్పి తిప్పి నా మీదికే తెస్తున్నాడే తట్టా!" అనుకుంటూ మెల్లగా తప్పుకుని, ఆఫీసువేపు నడుస్తూనే మాట్లాడుతున్నాడు. నారాయణ "...మా తమ్ముడు సెలవుల కొస్తే వస్తాడండీ లేకపోతే అక్కడ మా మేనమామ..." యింకా అంటూండగానే "సరే, అయితే సెలవు తీసుకుంటా! సాయంత్రం వీలుంటే యింటిదగ్గర కలుస్తా లెండి! వస్తా! 'అంటూనే వెళ్లిపోయా డా 'వేలువిడిచిన మేనమామ' వెనక్కు తిరిగి చూడకుండా!

"అమ్మయ్యా! బ్రతుకు జీవుడా అనుకున్న నారాయణ "ఓయి భగవంతుడా! నీ 'ఆడపిల్ల తండ్రి అవతార' మంటే యిదా? ఇవాళ గొప్పగా పరిచయం చేశావ్!" అనుకుంటూ వేళ మించిపోతూన్న ఆఫీసు వేపు తొందర తొందరగా కుక్కపరుగు తీశాడు.

ఆ సాయంత్రం యింటికి వెళ్లాక కొంత సేపటి వరకూ ఆ అపూర్వ పరిచయస్థుడికోసం నిరీక్షించాడు నారాయణ. అధమం బంధుత్వం కోసమైనా అగుపిస్తాడేమోనని ఆశించాడు. కాని యీ విశ్వ కుటుంబంలో ఆ మహనీయునికి యిలాగే బంధువులైన 'లక్ష' నారాయణుల్లోనూ యీ 'లక్ష్మీనారాయణ' ఎన్నోవాడో!


## గర్భరక్షక

అతి బలహీన లగుటచేత గర్భము ధరించిన పిమ్మట పెక్కు రుగ్మతల పాలగుచున్నారు. ముఖ్యముగ వీర లకు గర్భస్రావము, అకాల ప్రసవము, అప్పుడప్పుడు కడుపు నొప్పి, నడుము నొప్పి, రక్త హీనము, శరీరమందు పీకుచేయుట, బలహీనము, అలసట, ఆయాసము, అజీర్తి, మలబద్ధకము మొదలగు జబ్బులు కలుగుచున్నవి. 'గర్భరక్షక' సేవించిన పై జబ్బులు రాకుండుటయే గాక ప్రసవించువరకును శరీరము మంచి ఆరోగ్యస్థితి గలిగి యుండి చిందు మాసములు గర్భము ధరించి సుఖముగ ప్రసవించెదరు.

3 బో॥లు రు. 3 2 0
6 ,, రు. 5 8 0

కేసరి కుటీరం లిమిటెడ్
మద్రాసు-14

ఏజెంట్లు:
శ్రీ తారాం జనరల్ స్టోర్సు
బెజవాడ-పీకలవారి వీధి.